వణుకుతున్న పల్లెలు

- ఇంటింటా జ్వరపీడితులు
- ఆందోళన బాటలో ఆశ వర్కర్లు
- అందని మందులు
- కంపుకొడుతున్న డ్రెయినేజీలు

పక్క ఫొటోలో జ్వరంతో బాధపడుతున్న ఇద్దరి పేర్లు దయ్యాల లక్ష్మి దేవవ్వ, లావణ్య, వీరిది వేములవాడ రూరల్ మండలంలోని నాగాయపల్లి గ్రామం. ఒకే ఇంటిలో ఐదు రోజులుగా జ్వరాలు రావడంతో మంచానికే పరిమితయ్యారు. పెద్దాసుపత్రికి వెళ్లలేక గ్రామంలో ఉన్న ఆర్ఎంపీ డాక్టర్ వద్ద ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నారు.



వేములవాడరూరల్: ఇటీవల వర్షాలతో వాతావరణంలో ఏర్పడిన మార్పులతో పల్లెల్లో విషజ్వరాలు ప్రభావం తీవ్రంగా ఉంది. ప్రతి ఇంట్లో ఒక్కరు లేదా ఇద్దరు జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారు. 20 రోజులుగా మండలంలో ఏ ఇల్లు చూసిన జ్వరపీడితులు కనిపిస్తున్నారు. దీనికి తోడు ఆశావర్కర్లు కూడా సమ్మె బాట పట్టడంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సేవలు లేక ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా జ్వరాలు రావడంతో ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. కొన్ని ఆస్పత్రుల్లో దీన్ని ఆసరాగా చేసుకొని అవసరం లేకున్నా, వివిధ రకాల పరీక్షలను చేయించుకోవాలని సూచిస్తూ, బాధితుల నుంచి డబ్బులు గుంజుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో చాలా మందికి అవగాహన లేక, ఆశావర్కర్లు కూడా అందుబాటులో లేక బాధితులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

కంపుకొడుతున్న డ్రెయినేజీలు

గ్రామాల్లో డ్రెయినేజీలు, వాటర్ ట్యాంకులు శుభ్రం చేయించాల్సిన పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. చాలా గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాల వల్ల డ్రెయినేజీలు, రోడ్లు బురదమయంగా మారాయి. వీటికి తోడు నీటి నిల్వలు కూడా ఉండడంతో ఈగలు, దోమలు పెరగడంతో విషజ్వరాలు ప్రబలుతున్నాయని వైద్యులు అంటున్నారు. ఒకే ఇంటిలో ఒకరికి వచ్చిన తరువాత అదే ఇంటిలో వరుసగా జ్వరాలు వస్తున్నట్లు బాధితులు తెలుపుతున్నారు. కొంతమంది నిరుపేదలు డబ్బులు లేక గ్రామాల్లో ఉన్న ఆర్ఎంపీ వైద్యులతో చికిత్సలు చేయించుకుంటున్నారు.

సెలవులో ఉన్నాం



గ్రామాల్లో జ్వరాలు వస్తున్నాయి. ప్రభుత్వపరంగా ప్రస్తుతం సేవలందించే పరిస్థితిలో లేము. మా న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తీర్చాలని ఈ నెల 25 నుంచి సమ్మె చేస్తున్నాం.

– గొర్రె లావణ్య, ఆశ వర్కర్, మర్రిపల్లి

క్యాంపులు నిర్వహిస్తున్నాం



వేములవాడ మండలంలో వైరల్ ఫీవర్ ఉన్నట్లుగా మా దృష్టికి వచ్చింది. వెంటనే మా శాఖ తరుపున ఇప్పటికీ రెండు క్యాంపులు నిర్వహించాం. ఇంటింటికి సర్వే చేపడుతున్నాం. ఏ గ్రామంలో తీవ్రత ఎక్కువగా ఉంటే ఆ గ్రామంలో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసి వైద్యం అందిస్తాం. – దివ్య, వైద్యాధికారి, హన్మాజిపేట


కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలపై ప్రచారం



ఎల్లారెడ్డిపేట: ఇంటింటికి గ్యారెంటీ కార్డుల పంపిణీ

ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట/తంగళ్లపల్లి: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ముస్తాబాద్ మండలం కొండాపూర్, ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి మండల కేంద్రాల్లో, మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో బుధవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, రైతులకు ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని, అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. జిల్లా కార్యదర్శి లింగంగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, సద్ది లక్ష్మారెడ్డి, రాఘవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ఆధ్వర్యంలో నాయకులు ప్రచారం నిర్వహించారు.

పోలీస్ కానిస్టేబుళ్లుగా నలుగురు యువకులు ఎంపిక



గోగూరి ప్రవీణ్‌రెడ్డి



సాయికృష్ణారెడ్డి



నూనె నాగరాజు



కందారపు నవీన్

బోయినపల్లి: మండలంలోని తడగొండ నుంచి గోగూరి ప్రవీణ్‌రెడ్డి, గోగూరి సాయికృష్ణారెడ్డి, రత్నంపేట నుంచి నూనె నాగరాజు, కందారపు నవీన్‌ను పోలీస్ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. బుధవారం రాత్రి ఫలితాలు విడుదల అయ్యాయి. కానిస్టేబుళ్లుగా ఎంపికైన యువకుల తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ జీవనోపాధి పొందుతారు. ప్రవీణ్‌రెడ్డి, నాగరాజులు ఏఆర్ కానిస్టేబుళ్లుగా, సాయికృష్ణారెడ్డి ఎక్సైజ్, నవీన్ టీఎస్ఎస్పీ పీసీగా ఎంపికయ్యారు.

తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందిని నియమించాలి



మాట్లాడుతున్న రాము

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత మూలంగా మండల పలు రకాల పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన రాము మాట్లాడుతూ.. వీఆర్వోల విలీనం అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత ఏర్పడిందని దీంతో పనులు పెండింగ్‌లో ఉంటున్నాయని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఖాళీగా ఉన్న ఉద్యోగుల స్థానాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు పూర్మాని కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు

వలసకూలీ అనుమానాస్పద మృతి

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం పొత్తూరులో వలసకూలీ అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందిన వలసకూలీ చక్రి(25) బతుకుదెరువు కోసం పొత్తూరులో పనిచేస్తున్నాడు. కాగా బుధవారం రాత్రి శవమై కనిపించాడు. మృతుడి మెడ చుట్టూ వైరు చుట్టి ఉండడంతో ఆత్మహత్య చేసుకున్నాడా? హత్య చేశారా? అనే అనుమానాలు నెలకొన్నాయి. ఇల్లంతకుంట పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ముట్టడి

వీర్నపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు మల్లారపు అరుణ్‌కుమార్, మనోజ్‌కుమార్ తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్తల అరెస్టు



చందుర్తి ఠాణాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు

రుద్రంగి/చందుర్తి: ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని చలో హైద్రాబాద్ క్యాంపు ఆఫీస్ ముట్టడి కార్యక్రమానికి బుధవారం ఆశా వర్కర్లు వెళతారనే ముందస్తు సమాచారం మేరకు రుద్రంగి, చందుర్తి ఆశా వర్కర్లను ముందస్తుగా అరెస్టు చేసి ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అక్రమ అరెస్టులతో తమ ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరించారు. అదుపులోకి తీసుకున్న అంగన్‌వాడి కార్యకర్తలు స్వంత పూచీకత్తుపై బుధవారం సాయంత్రం విడుదల చేశారు. అరెస్టు అయిన వారిలో బుర్ర రేణుక, న్యాత పద్మ, పరిమళ, జ్యోతి, రమ, రాధిక, పద్మ, సంధ్య, అంబటి సరిత, కొమిరె మంజుల, పడాల అనసూయ, అల్లె కవిత, తిరుక్కొవెల శారద ఉన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

తంగళ్లపల్లి: ప్రస్తుత ఇంటర్నెట్ కాలంలో సైబర్ మోసాలపై యువత చాలా అప్రమత్తంగా ఉండాలని ఇల్లంతకుంట ఎస్సై డి.సుధాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై అప్రమత్తత గురించి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. స్మార్ట్ ఫోన్లు, ఇంటర్నెట్ వాడకంలో జాగ్రత్తలు వహించాలని, లాటరీలు, ఆన్‌లైన్ ఆఫర్ల పేరుతో మోసాలకు గురికావద్దని సూచించారు. ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. 24 గంటలలోపు టోల్ ఫ్రీ నంబర్ 1930, ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేయడం ద్వారా సైబర్ నేరగాళ్ల ఖాతాలను సీజ్ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మధు, లక్ష్మీనారాయణ, తిరుపతి, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలు.. పంపిణీలు



తుర్కపల్లిలో పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు



తెర్లుమద్దిలో ఆరోగ్య కేంద్రం ప్రారంభం

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలో ఎన్నికలకు ముందు ప్రారంభోత్సవాలు, అభివృద్ధి పనుల ప్రారంభం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందనే నేపథ్యంలో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అభివృద్ధి పనులను ప్రారంభించాలనుకున్న స్థానిక నేతలు చివరకు మంత్రి కేటీఆర్‌కు సమయం లభించకపోవడంతో వారే ప్రారంభించారు. మొర్రాపూర్, సేవాలాల్‌తండా, ఆవునూర్, తుర్కపల్లి గ్రామాల్లో గ్రామ పంచాయతీ నూతన భవనాలను ప్రారంభించారు. తెర్లుమద్దిలో ఆరోగ్య ఉపకేంద్రం, ప్రగతి భవన్, మోడల్ అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. తెర్లుమద్ది, సేవాలాల్‌తండా గ్రామాల మధ్య నక్కవాగుపై నిర్మించిన వంతెనను ప్రారంభించారు. ఆవునూర్‌లో ప్రగతి భవన్‌ను ప్రారంభించారు. రామలక్ష్మణపల్లెలో శ్మశానవాటికను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్, రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందరావు, సర్పంచ్‌లు ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

వ్యాసరచన పోటీలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాజన్నపేటలో స్వచ్ఛత ఈ సేవా కార్యక్రమంలో భాగంగా మహిళలు, పిల్లలకు వ్యాసరచన, ముగ్గుల పోటీలు బుధవారం నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ ముక్క శంకర్,ఉప సర్పంచ్ కల్లూరి వెంకటరమణరెడ్డి,మహిళ సంఘం అధ్యక్షులు, వీవోఏలు, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలు

తంగళ్లపల్లి: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 5వ విడత అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జి.కనకయ్య ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ నెల 8 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

శీత్లాభవాని భూములను కాపాడాలి

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం గోపాల్‌పల్లె తండాలో శీత్లా భవాని ఉత్సవాలు నిర్వహించుకునే ప్రభుత్వ భూములను కాపాడాలని బంజారా సేవా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య బాబునాయక్ తహసీల్దార్‌కు బుధవారం విజ్ఞప్తి చేశాడు. యాభై ఏళ్లుగా గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో శీత్లా భవాని ఉత్సవాలను నిర్వహించుకుంటున్నామని, ఇటీవల కొంతమంది ఆట్టి భూములను చదును చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తండాలో గిరిజనులు తమ ఆరాధ్య దైవమైన శీత్లా భవాని వేడుకలను ఇక్కడే నిర్వహించుకుంటున్నారన్నారు. ఏటా నిర్వహించుకునే వేడుకల భూముల్లోనే ఎలాంటి అనుమతులు లేకుండా చదును చేశారని ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసి గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు.

'బండి'కి పదవి లేకనే కారెక్కిన ఎంపీపీ

వేములవాడరూరల్: ఎంపీపీ బండ మల్లేశం బీఆర్ఎస్‌లో చేరడంతో మండలంలో జోరుగా చర్చ జరుగుతోంది. మర్రిపల్లి ఎంపీటీసీగా బీజేపీ తరుపున గెలిచి ఒకే సీటుతో బీఆర్ఎస్ ఎంపీటీసీల మద్దతుతో ఎంపీపీ అయిన ఆయన 18 ఏళ్లుగా బీజేపీలో సీనియర్ నాయకుడుగా ఉన్నారు. మంగళవారం మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ కండువా కప్పుకోవడంతో బుధవారం మండలంలో జోరుగా చర్చించుకుంటున్నారు. మళ్లీ మండల అధ్యక్ష పదవి కోసమే బీఆర్ఎస్ పార్టీలో చేరాడని ప్రచారం జరుగుతోంది. బండి సంజయ్‌కు దగ్గర సన్నిహితుడిగా ఉన్న మల్లేశం ఇటీవల ఆయనను రాష్ట్ర అధ్యక్షుడిగా తొలగించడంతో అప్పటి నుంచి బండి లేడనే నిరుత్సాహంతో ఉన్న మల్లేశం పార్టీని వీడినట్లు కూడా ఆయన దగ్గరి స్నేహితులతో అన్నట్లు తెలిసింది. ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోవడంతో అదే బాటలో మరికొందరు సీనియర్లు ఉన్నట్లు సమాచారం.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

గంభీరావుపేట: మండలంలోని ముస్తఫానగర్ గ్రామంలో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సిరిసిల్ల వారి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్ల కోసం సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు కవిత, నాగరాజు, అజయ్, ఉపసర్పంచ్ శివరాత్రి నర్సింలు, నాయకులు బండ రమేశ్, ఈరవేని రమేశ్, దేవేందర్, నాగకృష్ణ పాల్గొన్నారు.

వికలాంగులకు బస్ పాస్‌లు పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని కేసీఆర్ నగర్ (డబుల్ బెడ్రూం) సముదాయంలో వికలాంగులకు బుధవారం బస్‌పాస్‌లు అందజేశారు. ఆర్టీసీ అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి పాస్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బల్ల మహేష్, కూరపాటి శ్రీధర్, గుండెటి రవితేజ, సమలేటి గణ్‌శ్యాం, హిందూ సాంస్కృతిక సమితి సభ్యులు పాల్గొన్నారు.

రాయితీలను వినియోగించుకోవాలి

కోనరావుపేట: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే రాయితీలను రైతులు వినియోగించుకోవాలని బీజేపీ యువమోర్చా నాయకులు జవ్వాజి తిరుపతి గౌడ్ అన్నారు. కోనరావుపేట మండలం మర్తనపేటలో కిసాన్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా నాయకులు జవ్వాజి తిరుపతి గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పథకాలను సద్వినియోగపర్చుకోవాలని కోరారు. ఉపసర్పంచ్ పర్శరాములు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం చింతాల్‌ఠాణా గ్రామంలోని మహిళ సంఘం భవన ప్రహరీ నిర్మాణం కోసం ఎంపీపీ బూర వజ్రమ్మ బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మ్యాకల రవి, సెస్ డైరెక్టర్ హరిచరణ్ రావు, వైస్ఎంపీపీ రవిచందర్‌రావు, సర్పంచ్ రేగుల పాటి రాణి, నాయకులు ఉన్నారు.

బీజేపీ పటిష్టానికి బూత్ కమిటీలే కీలకం

బోయినపల్లి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి రావాలంటే బూత్, మోర్చాల అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, పదాధికారులు, జిల్లా నాయకులు ప్రతీ ఒక్కరు బూత్ స్థాయిలో పార్టీని పటిష్టం చేయాలని బీజేపీ చొప్పదండి నియోజకవర్గ కన్వీనర్ పెరుక శ్రవణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల బూత్, మోర్చా అధ్యక్షుల, పదాదికారుల సమావేశం నిర్వహించారు.

నిధులు మంజూరు

వీర్నపల్లి: మండలంలోని కంచర్ల గ్రామంలో మాల సంఘం ఆవరణలో బోరు వేయడానికి నిధులు మంజూరు చేసినట్లు జెడ్పీటీసీ కళావతి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రజిత లింబాద్రి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రధాని మోదీ చిత్రపటానికి పసుపుతో అభిషేకం



పసుపు అభిషేకం చేస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: తెలంగాణ రాష్ట్రానికి పసుపు బోర్డు ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఇల్లంతకుంట మండల యువజన సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ప్రధాని మోదీ చిత్రపటానికి పసుపుతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో యువజన సంఘాల మండల అధ్యక్షుడు బెంద్రం తిరుపతి రెపాల్గొన్నారు.

తోటి మిత్రుని కుటుంబానికి చేయూత



బాండ్‌లు అందజేస్తున్న క్లాస్ మేట్స్

రుద్రంగి: కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతిచెందిన మండల కేంద్రానికి చెందిన పీసరి భూమానందం కుటుంబానికి స్థానిక జెడ్పీ హైస్కూల్ 2000–01 క్లాస్‌మేట్స్ చేయూత అందించారు. మిత్రులందరూ కలిసి జమ చేసిన డబ్బులతో ఇద్దరు కూతుళ్ల పేరున రూ.ఒక లక్ష ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు బాండ్‌లు అందజేశారు. మిత్రులు గడప వేణు, ఎల్లేశ్వరం అనిల్, ఎల్ల గంగాధర్, అల్లూరి గంగారెడ్డి, గడ్డం సంతోష్, మేళ్ళ లక్ష్మణ్, మర్రిపెల్లి గంగాధర్, కాదాసు మహేందర్, నర్సయ్య, సిరిపురం మహేందర్, కథలాపూర్ ఎంపీపీ జవ్వాజి రేవతి ఉన్నారు. తంగళ్లపల్లి: బీజేపీ మండల అధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.
తోటి మిత్రుని కుటుంబానికి చేయూత

బతుకమ్మ చీరెల పంపిణీ



ముస్తాబాద్: మండలంలోని మద్దికుంట, సేవాలాల్‌తండా, తుర్కపల్లి, ఆవునూర్, రామలక్ష్మణపల్లె, తెర్లుమద్ది గ్రామాల్లో బతుకమ్మ చీరలను బుధవారం పంపిణీ చేశారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ఆడ పడుచులు ఆత్మగౌరవంతో పండగ జరుపుకునేలా చీరెలను పదేళ్లుగా పంపిణీ చేస్తున్నారన్నారు. ఎంపీపీ శరత్ రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోపాల్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపసర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరాహార దీక్షలు



నిరాహార దీక్షలు చేస్తున్న గ్రామస్తులు

గంభీరావుపేట: ప్రజా సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ స్థానిక ముస్తఫానగర్‌లో పలువురు గ్రామస్తులు బుధవారం నుంచి నిరాహార దీక్షలు చేపట్టారు. గ్రామంలో డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించాలని, ఆరోగ్య ఉప కేంద్రం, మహిళా సమాఖ్య భవనం, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, రోడ్డు విస్తరణలో ఇల్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. చెరువులకు ఆనుకొని ఉన్న పట్టా భూములు ముంపునకు గురికాకుండా మత్తడుల ఎత్తు తగ్గించాలని కోరారు. అధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించేంత వరకు దీక్షలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ దీక్ష శిబిరంలో నాయకులు నాగరాజుగౌడ్, కృష్ణకాంత్ యాదవ్, ప్రశాంత్‌రావు, నాగరాజు, నర్సింలు, ప్రశాంత్ పాల్గొన్నారు.

గిరిజన కళాశాల విద్యార్థినికి సన్మానం



మౌనికను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని తెలంగాణ మహిళా గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల విద్యార్థిని జి.మౌనికను బుధవారం సన్మానించారు. 2022–23 ఎంపీసీఎస్ పూర్తిచేసిన మౌనిక మేఘాలయ పోస్టల్ శాఖలో ఉద్యోగం సాధించడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ రజిని, వైస్ ప్రిన్సిపాల్ సుధా సింధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోయినపల్లి: జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం పూడూర్ 132–33 విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 33 కేవీ పీఎంఐ (ప్రీ మాన్సూన్ ఇన్‌స్పెక్షన్) ఉన్నందున మండలంలోని మల్కాపూర్, కోరెం, స్తంభంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సెస్ ఏఈ జీ. ప్రశాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు సబ్‌స్టేషన్ల పరిధిలోని మల్కాపూర్, తడగొండ, అనంతపల్లి, నల్లగొండ, తిప్పాయిపల్లి, తడగొండ, సతభంపల్లి, గుండన్నపల్లి బూర్గుపల్లి, కోరెం, దుండ్రపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

కార్యవర్గం

ముస్లిం మైనారిటీ యూత్



ఎల్లారెడ్డిపేట: మండలంలోని గొల్లపల్లి ముస్లిం మైనారిటీ యూత్ గ్రామ కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సయ్యద్ షారుఖ్, ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ ఇస్మాయిల్, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ షారుఖ్, కోశాధికారిగా మహమ్మద్ సమీర్, గౌరవ సలహాదారుగా మహమ్మద్ సోహెల్, కార్యవర్గ సభ్యులుగా వసీం, అల్తాఫ్, సమద్, సమీర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మైనారిటీ యూత్ మండలాధ్యక్షుడు సయ్యద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

గంభీరావుపేట: మండలం లింగన్నపేట సెక్టార్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విలేజ్ హెల్త్ శానిటేషన్ న్యూట్రిషన్ డే సందర్భంగా లబ్ధిదారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులకు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ వంగ కరుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ, సర్పంచ్‌లు అక్కపల్లి స్వరూప, బాబు, రాజు పాల్గొన్నారు.

ప్రగతిభవన్‌కు శంకుస్థాపన

ఎల్లారెడ్డిపేట: గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు ప్రగతి భవన్‌లు వేదికలుగా నిలుస్తున్నాయని జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లో బుధవారం ప్రగతిభవన్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి రేణుక,సర్పంచ్ మునిగే అమృత,ఎంపీటీసీ ఉప్పుల మల్లేశం,సెస్ డైరెక్టర్ కృష్ణహరి,సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి,వైస్ చైర్మన్ సత్తయ్య,పట్టణ అధ్యక్షులు బండారి బాల్‌రెడ్డి,డైరెక్టర్ మెండె శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో మొదటి స్థానం



కోనరావుపేట: ఉమ్మడి జిల్లాస్థాయిలో జరిగిన పోటీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా మొదటిస్థానంలో నిలిచింది. జగిత్యాల జిల్లా కొడిమ్యాలలో ఉమ్మడి జిల్లాస్థాయి ఖోఖో అండర్ –17 పోటీలు ఘనంగా జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న రాజన్న సిరిసిల్ల జిల్లా జట్టు మొదటి స్థానంలో నిలిచింది. కబడ్డీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు జిల్లా జట్టును మొదటి స్థానంలో నిలిపారు. పీఈటీ ఎస్‌కే మొయినొద్దీన్ అభినందనలు తెలిపారు.

గీతకార్మికుడికి గాయాలు

కోనరావుపేట: మండల కేంద్రానికి చెందిన లింగాపూర్ వెంకటస్వామి ప్రమాదవశాత్తు ఈత చెట్టుపై నుంచి జారిపడి గాయాలపాలయ్యాడు. గ్రామానికి చెందిన లింగాపూరం వెంకటస్వామి అనే గీత కార్మికుడు బుధవారం ఈతచెట్టు ఎక్కి జారిపడగా చేతు విరిగి గాయాలయ్యాయి. గమనించిన తోటి కార్మికులు వెంటనే జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చేర్పించి వైద్య సేవలు అందిస్తున్నారు.

నేడు మంత్రి పర్యటన

రుద్రంగి: మండలంలోని మానాల, గిరిజన తండా గ్రామాల్లో గురువారం రోడ్లు, భవనాల శాఖ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పర్యటించనున్నట్లు వైస్ఎంపీపీ చిన్న భూమయ్య ఒక ప్రకటనలో తెలిపారు లబ్ధిదారులకు పోడు భూములకు పట్టాల పంపిణీ, తాతమ్మ వాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి, మానాల నుంచి గొర్రెగుండం గంగ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.